# ఎండల్లో హాయ్..హాయ్



వేసవి కాలమంటే ఎండలు, బండలే కాదు... సంతోషంగా గడిపే రోజులూ ఉంటాయండోయ్ !

నెత్తిన సర్రున కాలే మంట... ఎండ, పై నుంచి కిందకు నిండా కారే చెమట, శరీరంలో ఆవిరవుతుండే శరీర తాపం ,....ఇవన్నీ ఎండాకాలంలో చీకాకు పెడుతుంటాయి. అంతే కాదు..ఇదే వేసవి కాలం చాలా మందికి ఆనందాన్ని కూడా ఇస్తుంది. అది మన పరిస్థితులు, మన దృక్కోణం, మన జీవనశైలి మీద ఆధారపడి ఉంటుంది.

పిల్లల దృష్టిలో 'వేసవి' అనేది అత్యంత సంతోషకరమైన సందర్భం. పాఠశాలలకు సెలవులివ్వడంతో వారు ఒత్తిడి లేకుండా ఆటలలో, వినోదాలలో గడుపుతారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నేహితులతో కలిసి ఆటలు ఆడటం, చెట్ల నీడలో కూర్చుని కథలు, కబుర్లు చెప్పుకోవడం వంటి వంటే ఎంత ఆనందమో! మామిడి పండ్లు, పుచ్చ కాయలు తినడమంటే మరీ..మరీ... ఆనందం. ఇవే వారి ఆనందాలను ద్విగుణీకృతం చేస్తుంటాయి. ఇలాంటప్పుడే వారి జీవితాలు ఉత్సాహవంతంగా ఎగిరి గంతులేస్తాయి.

అందుకే పిల్లలకు వేసవి కాలం అనేది నిజమైన సంతోష కాలం.

చాలా మంది తమ తాతయ్య, అమ్మమ్మల ఇంట్లో గడపడానికి వెళ్తుంటారు , అలా కుటుంబ సభ్యుల తో కలిసి సమ యం గడపడం వలన అనుబంధాలు మరింత బలపడతాయి.

కుటుం బాల పరంగా చూసినా వేసవి ప్రత్యేకమైన సమయం. నగరాల్లో బిజీ బిజీగా ఉండే జీవితానికి కొంత విరామమే.

ఈ సమయం నిజంగా విరామ సమయం కన్నా విజ్ఞాన సమయం అని కూడా చెప్పుకోవాల్సి వస్తుంది కుటుంబ సమైక్యతను పెంపొందించే కాలంగా భాసిల్లుతోంది. ప్రతి ఒక్కరికీ వేసవి సమయం ఎంతో సంతోషకరంగా ఉంటుందని చెప్పుకోవాల్సి వస్తే వృద్ధులు, చిన్నపిల్లలు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే అవకాశమూ ఉంటుంది. కాబట్టి పరిస్థితులు అనుకూలంగా లేకపోతే వేసవి సంతోషాన్ని ఇవ్వదు.

అయితే కొన్ని పరిస్థితులను పాటిస్తే వేసవిని సంతోషకరంగా మార్చుకోవచ్చు. తగి నంత నీరు తాగడం, చల్లని ప్రదేశాల్లో విశ్రాంతి తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు అవసరం. ప్రకృతిని ఆస్వాదించ డం, ఉదయం లేదా సాయంత్రం సమయంలో బయట గడపడం ద్వారా వేసవి అందాలను కూడా అనుభవించవచ్చు. ముఖ్యంగా సానుకూల దృక్కోణం కలిగి ఉంటే ఏ కాలమైనా ఆనందంగా మారుతుంది.



వేసవి కాలం స్వతహాగా సంతోషకరమో కష్టకరమో కాదు. అది మన మనసు, మన పరిస్థితులు, మన జీవన విధానంపై ఆధారపడి ఉంటుంది. సరైన జాగ్రత్తలు తీసుకుంటూ, చిన్న చిన్న ఆనందాలను ఆస్వాదిస్తూ ... వేసవిని గడపితే ... సంతోషకరమే !

## జలక్రీడలో జాగ్రత్త !

ఈత ఒక మంచి వ్యాయామం. ఆరోగ్యానికి కూడా ఎంతో ఉపయోగకరం. ఈత ఒక ఆనందదాయకమైన క్రీడ. ముఖ్యంగా బాలురు ఈత నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం, ధైర్యం , ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. ఈత కొట్టేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశముంది. అందువల్ల బాలురు ఈత కొట్టేటప్పుడు కొన్ని ముఖ్యమైన నియమాలు పాటించాలి. ఈత గురువుల పర్యవేక్షణలో నేర్చుకోవాలి. స్వయంగా లేదా స్నేహితులతో కలిసి తెలియని ప్రదేశాల్లో ఈత కొట్టడం ప్రమాదకరం. నీటి లోతు ఎంత ఉందో ముందుగా తెలుసుకోవాలి. ఈత కొట్టే ముందు శరీరాన్ని కొంచెం వ్యాయామం చేసి సిద్ధం చేయాలి. ఆకలి ఎక్కువగా ఉన్నప్పుడు లేదా పూర్తిగా తిన్న వెంటనే నీటిలోకి దిగకూడదు. ఇది ఆరోగ్యానికి హానికరం.



లైఫ్ జాకెట్ వంటి రక్షణ పరికరాలు ఉపయోగించడం మంచిది. ముఖ్యంగా ఈత బాగా రాని వారు, అలాగే ఒంటరిగా ఈత కొట్టకుండా ఎప్పుడూ ఇతరు లతో కలిసి ఉండాలి. ప్రమాదం జరిగితే ఎలా స్పందించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. సహాయం కోసం అరిచే ధైర్యం ఉండాలి. ఇతరులకు కూడా సహాయం చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఈతను ఆస్వాదించగల నియమాలను పాటిస్తే బాలురు సురక్షిత జాగ్రత్తలు పాటించడం అత్యవసరం.

## త్యాగనిరతి !

రామాయణంలో గొప్ప త్యాగనిరతి ఊర్మిళ..ది. ఆమె చేసిన త్యాగం ఆధ్యాత్మికంగా చాలా గొప్పది.'ఊర్మిళ నిద్ర' అనే భావన మనకు త్యాగం, భక్తి, కర్తవ్య నిబద్ధత వంటి విలువలను గుర్తు చేస్తుంది. లక్ష్మణుడు శ్రీరామునితో కలిసి 14 సంవత్సరాలు అరణ్యంలో నివసించాల్సి వచ్చింది. ఈ సమయంలో ఆయన రాత్రింబగళ్లు నిద్రకు కూడా అవకాశం లేకుండా రాముని సేవలో నిమగ్నమై ఉండాలి. అయితే, నిద్ర అనేది ప్రతి మనిషికి సహజమైన అవసరం. ఇక్కడే ఊర్మిళ పాత్ర ఆవిర్భవిస్తుంది. పురాణ కథనం ప్రకారం, లక్ష్మణుడు తన నిద్రను విడిచిపెట్టాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆ నిద్రదేవత ఊర్మిళ దగ్గరకు వెళ్లింది. ఊర్మిళ తన భర్తకు సహాయం చేయడానికి, అతని నిద్రను తానే స్వీకరించింది. 14 సంవత్సరాల పాటు ఆమె నిద్రలోనే ఉండి, లక్ష్మణుడు జాగరూకంగా రామునికి సేవ చేయడానికి అవకాశం కల్పించింది. ఊర్మిళ తన వ్యక్తిగత సుఖాలను, తన జీవితాన్ని కూడా పక్కన పెట్టి, తన భర్త కర్తవ్యానికి తోడ్పడింది. ఇది కేవలం ఒక ఆత్మీయ ధర్మాన్ని పాటించిన చర్య.

## వాముతో ఉపయోగాలు..



వామును బుగ్గన పెట్టుకుని నమిలి చప్పరిస్తూ రసాన్ని మింగితే గొంతులో నొప్పి, గురగుర శబ్దాలు తగ్గుతాయి.

వామును కరక్కాయ, ఉసిరికాయ, తావికాయలతో కలిపి ముద్దగా నూరి దంతాల మూలల్లో పెడితే దంత వ్యాధులు తగ్గుతాయి.

వామును ధనియాలు, జీలకర్రలను దోరగా వేయించి కషాయం చేసి తీసుకుంటే జ్వరం తగ్గుతుంది. వాము మిరియాలు, ఉప్పు సమభాగాలుగా తీసుకొని చూర్ణం చేసి ప్రతి దినం భోజనానికి ముందు సేవిస్తే అజీర్ణం ఉదరశూల తగ్గును.

# 'ఏసీ'లో ఉండడమే మీకు ఇష్టమా!.


ఎవరికైనా సరే ! ఎండల నుంచి ఉపశమనానికి శీతల యంత్రంకేసి చూస్తుం టాము. ఏసీ కింద పడుకోగానే, హమ్మయ్య అని నిట్టూర్పులు విడుస్తారు. అదేంటో కావలసినంత హాయినిస్తుంది. అందుకేనేమో! దాన్ని కాసేపు వది లేందుకు కూడా ఇష్టపడరు. అయినా, అతిగా వాడటం వల్ల ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినా బయటకు రారు. వేడి వాతావరణం నుంచి హఠాత్తుగా చల్లని ఏసీ గదిలోకి వెళ్లడం 'థర్మల్ షాక్'కు దారితీసే అవకాశం ఉంటుందని గుర్తుంచుకోవాలి.ఏసీని 24-26 డిగ్రీల మధ్య ఉంచడం, గదికి వెంటిలేషన్ వంటి జాగ్రత్తలతో ప్రమాదాల నివారణకు ఛాన్స్ ఉంటుంది. భారతదేశంలో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటుతున్న వేళ, పట్టణ ప్రాంతాల్లో ఎయిర్ కండిషనర్ (ఏసీ) వాడకం విలాసం నుంచి నిత్యావసరంగా మారింది. చాలామంది రోజులో 20 గంటలకు పైగా చల్లని కార్యాలయాల్లోనో, కార్లలోనో ఇళ్లలోనే గడుపుతున్నారు. ఎండవేడి నుంచి ఏసీ తక్షణ ఉపశమనం కలిగిస్తున్నప్పటికీ, ఈ కృత్రిమ శీతలీకరణ వ్యవస్థపై అధికంగా ఆధారపడటం మన ఆరోగ్యంపై తీవ్రమైన దుష్ప్రభావాలు చూపుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

వివిధ అధ్యయనాల ప్రకారం సాధారణ గాలి ప్రసరణ ఉన్న ప్రదేశాలతో పోలిస్తే, ఏసీ వాతావరణంలో ఎక్కువ సమయం గడిపే వారిలో శ్వాసకోశ సంబంధిత లక్షణాలు 50 శాతం అధికంగా కనిపిస్తున్నాయి. సెంట్రల్ ఏసీ ఉన్న భవనాల్లో పనిచేసే వారిలో సిక్ బిల్డింగ్ సిండ్రోమ్ లక్షణాలు ఎక్కువగా ఉన్నట్లు అంతర్జాతీయ పత్రికలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలో ఏసీ వాడకం వల్ల కలిగే ఐదు ప్రధాన ఆరోగ్య ప్రమాదాలపై నిపుణులు విశ్లేషణ గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

ఏసీ యూనిట్లు, ముఖ్యంగా సెంట్రల్ కూలింగ్ సిస్టమ్స్ తేమను ఎక్కువగా నిల్వ చేస్తాయి. ఏసీ ఫిల్టర్లను, కాయిల్స్ను ఎప్పటికప్పుడు శుభ్రం చేయకపోతే, అక్కడ నిలిచిన తేమలో బ్యాక్టీరియా, బూజు, ఫంగస్ వంటివి వృద్ధి చెందుతాయి. ముఖ్యంగా 'లెజియోనెల్లా' అనే బ్యాక్టీరియా ఏసీ డక్టులలోని నీటిలో పెరిగి, ఏసీ ఆన్ చేసినప్పుడు గాలి ద్వారా వ్యాపించి 'లెజియోనైర్స్' అనే తీవ్రమైన న్యూమోనియాకు కారణమవుతుంది. అలాగే, బూజు కణాలు అలర్జీలు, దీర్ఘకాలిక సైనస్ ఇన్ఫెక్షన్లకు దారితీస్తాయి.

ఏసీ గదిలోని గాలిని చల్లబరిచే క్రమంలో తేమను గ్రహిస్తుంది. ఇది గాలిలోని తేమతో పాటు మన శరీరంలోని తేమను కూడా లాగేస్తుంది. దీనివల్ల 'డ్రై ఐ సిండ్రోమ్' ఏర్పడికళ్లు పొడిబారడం, ఎర్రబడటం, మంట వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాగే, చర్మం తన సహజ నూనెలను కోల్పోయి పొడిబారడం, దురద, పొట్టు రాలడం వంటి సమస్యలు తలెత్తుతాయి. తామర, సోరియాసిస్ వంటి సమస్యలు ఉన్నవారికి ఇది మరింత ప్రమాదకరం.

ఏసీ గదిలో గాలి బయటకు వెళ్లి, తాజా గాలి లోపలికి రాదు. ఉన్న గాలినే మళ్లీ మళ్లీ చల్లబరచడం వల్ల గదిలో దుమ్ము, పుప్పొడి, బూజు వంటి కాలుష్య కారకాల సాంద్రత పెరుగుతుంది. 'ఏసీ ఫిల్టర్లను ప్రతి 15 నుంచి 30 రోజులకు శుభ్రచేయకపోతే, మనం కలుషితమైన గాలినే పీలుస్తాం. ఇది ఆస్తమా, దీర్ఘకాలిక రినిటిస్ వంటి సమస్యలను ప్రేరేపిస్తుంది' అని నిపుణులు హెచ్చరిస్తున్నారు. చల్లని గాలి నేరుగా తగలడం వల్ల కొంతమందిలో శ్వాసనాళాలు సంకోచించి, ఆయాసం వస్తుంది.



బయట 45 డిగ్రీల వేడి నుంచి అకస్మాత్తుగా 18 డిగ్రీల చల్లని ఏసీ గదిలోకి ప్రవేశించినప్పుడు శరీరం 'థర్మల్ షాక్'కు గురవుతుంది. ఈ ఉష్ణోగ్రత మార్పులకు అనుగుణంగా సర్దుబాటు అయ్యేందుకు శరీరంపై తీవ్రమైన ఒత్తిడి పడుతుంది. రక్తనాళాలు ఒక్కసారిగా సంకోచించడం వల్ల ముక్కులో రోగనిరోధక శక్తి తగ్గి జలుబు, ఫ్లూవంటి వైరల్ ఇన్ఫెక్షన్ల బారినపడేప్రమాదం పెరుగుతుంది.

ఏసీ టెంపరేచర్ను 24 నుంచి 26 డిగ్రీల సెల్సియస్ మధ్య ఉంచాలి. ప్రతి నాలుగు గంటల ఏసీ వాడకానికి, 15 నిమిషాల పాటు కిటికీలు తెరిచి గదిలో గాలి ప్రసరణ జరిగేలా చూడాలి. శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండేందుకు తరచుగా నీళ్లు, పండ్ల రసాలు తాగాలి. ఏసీ ఫిల్టర్లను ప్రతి రెండు వారాలకు ఒకసారి శుభ్రం చేయాలి. సీజన్ ప్రారంభంలో ప్రొఫెషనల్స్ డీప్ క్లీనింగ్ చేయించడం ఉత్తమం.

# హిలేరియస్ వ్లాగర్‌గా అలరిస్తా



డిఫరెంట్ ఎంటర్టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్ డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి గాయపడ్డ సింహం అలరించబోతున్నారు. ఈ చిత్రంలో హీరో శ్రీవిష్ణు స్పెషల్ రోల్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని పవన్ సాదినేని సమర్పణలో, కళ్యాణ చక్రవర్తి మంథిన, భాను కిరణ్ ప్రతాప, విజయ్ కృష్ణ లింగమనేని, ఉమేష్ బన్సల్ సప్తస్వ మీడియా వర్క్స్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ బ్యానర్ల పై నిర్మించారు. ఫరియా అబ్దుల్లా, మానస చౌదరి కథానాయికలుగా నటించారు. జేడి చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. ఇప్పటికే ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసిన ఈ సినిమా మే 1వ తేదీన ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ ఫరియా అబ్దుల్లా విలేకరుల సమావేశంలో సినిమా విశేషాలు పంచుకున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే.. ' ఇందులో నేను శాలిని అనే వ్లాగర్ పాత్రలో కనిపిస్తాను. ఇది ఒక క్రేజీ క్యామియో రోల్. నా క్యారెక్టర్‌లో కామెడీ ఎలిమెంట్స్ చాలా ఎక్కువగా ఉంటాయి. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ ఈ యూనివర్స్‌ను, పాత్రలను చాలా హిలేరియస్‌గా డిజైన్ చేశారు. ముఖ్యంగా మల్టిపుల్ లేయర్స్ ఉన్న కథలో ప్రతి పాత్రకు ఒక ప్రాముఖ్యత ఉంటుంది. నా క్యారెక్టర్ రైటింగ్ చాలా ఫన్నీగా వచ్చింది. తరుణ్ కామెడీ టైమింగ్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. శ్రీవిష్ణు పాత్ర చాలా ఇంట్రెస్టింగ్‌గా ఉంటుంది, దాన్ని చాలా బాగా డిజైన్ చేశారు. ఇక మానస పాత్ర గురించి చెప్పాలంటే.. తను హ్యాండ్ ఇచ్చిన అమ్మాయి అయితే, నేను హ్యాండ్ పట్టుకున్న అమ్మాయిని (నవ్వుతూ). వీరిద్దరి మధ్య సీన్స్ కూడా చాలా బాగుంటాయి.

## నవ్వుల విందుకు సిద్ధం



కాంతార చిత్రంతో దేశవ్యాప్త సంచలనం సృష్టించిన విలక్షణ నటుడు రిషబ్ శెట్టి హీరోగా నటించిన తాజా చిత్రం ఏ ఫిల్మ్ బై గిరి విడుదలకు ముహూర్తం ఖరారైంది. స్టార్ వుడ్ ఎంటర్టైన్మెంట్, రిషబ్ శెట్టి ఫిలిమ్స్ సంయుక్త నిర్మాణంలో, ఎమ్. అచ్చిబాబు సమర్పణలో తెరకెక్కిన ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని మే 8న గ్రాండ్‌గా విడుదల కానుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే..రచన ఇందిర్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమా పక్కా కామెడీ ఎంటర్టైనర్‌గా రూపొందింది. ఈ చిత్రం ద్వారా కరణ్ అనంత్, అనిరుద్ మహేష్ దర్శకులుగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ఎంజి మూవీస్ సంస్థ ద్వారా ఎమ్. అచ్చిబాబు అత్యంత భారీ స్థాయిలో థియేటర్లలో విడుదల చేస్తున్నారు. ఇందులో ఎస్.పి తాపేశ్వరి, హోన్నవలి కృష్ణ, ప్రమోద్ శెట్టి వంటి హేమాహేమీలు ముఖ్య పాత్రల్లో నటించారు. సంగీతం: వాసుకి వైభవ్, సినిమాటోగ్రఫీ: రఘునాథ్ సిఎంఎడిటింగ్: భరత్ ఎంసి, ప్రదీప్ అర్ రావురిషబ్ శెట్టికి తెలుగులో ఉన్న క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాను ఇక్కడ భారీగా ప్రమోట్ చేస్తున్నారు. వేసవి కానుకగా మే 8న థియేటర్లలో నవ్వుల విందును పంచడానికి గిరి సిద్ధమయ్యాడు.

## కల్కి సీక్వెల్‌లో శింబు మెరుపులు?

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన కల్కి సినిమా సీక్వెల్‌లో ఒక అత్యంత కీలకమైన స్పెషల్ రోల్ ఉందని, ఆ పాత్రలో కోలీవుడ్ స్టార్ హీరో శింబు కనిపించబోతున్నారని సమాచారం. మరీ ముఖ్యంగా, సినిమా క్లైమాక్స్‌లో వచ్చే ఈ పాత్ర కథను మలుపు తిప్పుతుందని తెలుస్తోంది.

# తెర

## కోల్ సిండికేట్ వేట



టాలీవుడ్ వెర్సటైల్ హీరోయిన్ సంయుక్త మీనన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న భారీ యాక్షన్ థ్రిల్లర్ ది బ్లాక్ గోల్డ్ చిత్రీకరణ విజయవంతంగా పూర్తయింది. యోగేశ్ కె.ఎం.సి. దర్శకత్వంలో, మాగంటి పిక్చర్స్ సహకారంతో రాజేశ్ దండా ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. నిజ జీవిత సంఘటనల స్ఫూర్తితో..తెలంగాణ - మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లోని బొగ్గు గనుల నేపథ్యంలో, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్ సిండికేట్ మాఫియా కథాంశంతో ఈ సినిమా తెరకెక్కింది. ఇందులో సంయుక్త చట్టాన్ని గౌరవించే, అత్యంత శక్తివంతమైన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన పోస్టర్‌లో చేతిలో గన్ పట్టుకుని సంయుక్త కనిపిస్తున్న తీరు సినిమాపై భారీ అంచనాలను పెంచింది. మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, ఆదిలాబాద్ వంటి ప్రాంతాల్లోని బొగ్గు గనుల్లో 45 డిగ్రీల ఎండను సైతం లెక్కచేయకుండా ఈ సినిమా చిత్రీకరణ జరిపారు. సుమారు 60కి పైగా పనిదినాల్లో, ఐదు పవర్‌ఫుల్ షెడ్యూల్స్‌లో షూటింగ్ పూర్తయ్యింది. టెక్నికల్‌గా ఈ సినిమా అత్యున్నత స్థాయిలో ఉండబోతోందని, కొన్ని కీలక సన్నివేశాల కోసం ఏకకాలంలో ఐదు కెమెరాలను ఉపయోగించినట్లు దర్శకుడు తెలిపారు. ఈ సినిమాలో మురళీ శర్మ, రావు రమేష్, నాసర్ వంటి దిగ్గజ నటులతో పాటు మనీష్ వాధ్వా, చంద్రిక రవి కీలక పాత్రలు పోషిస్తున్నారు. సామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగు, హిందీ, తమిళం, మలయాళం మరియు కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. షూటింగ్ పూర్తవడంతో ప్రస్తుతం చిత్ర బృందం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో నిమగ్నమైంది.

## వెండితెరపై గైరమ్మత్త రచ్చ..



సోషల్ మీడియా సెన్సేషన్, క్లాసికల్ డ్యాన్సర్ దువ్వాడ మాధురి (దివ్వెల మాధురి) ఇప్పుడు కొత్త అవతారమెత్తారు. వివాదాలు, రాజకీయ వార్తలతో ఎప్పుడూ ట్రెండింగ్‌లో ఉండే ఆమె.. ఇప్పుడు వెండితెరపై తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. చీన్ టపాక్ డుం డుం అనే వెరైటీ టైటిల్‌తో వస్తున్న సినిమా ద్వారా ఆమె టాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇస్తున్నారు. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో మాధురి గైరమ్మత్త అనే పవర్‌ఫుల్ అత్త పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. గంభీరమైన చూపులు, పక్కా విలేజ్ మేకోవర్‌తో ఆమె కనిపిస్తుండటంతో, సినిమాలో ఆమె క్యారెక్టర్ చాలా వైవిధ్యంగా ఉండబోతోందని అర్థమవుతోంది. కుమారి శ్రీమతి ఫేమ్ గవిరెడ్డి శ్రీనివాస్ ఈ సినిమాలో హీరోగా నటిస్తున్నారు. వై. ఎన్. లోహిత్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. విలేజ్ టాకీస్ బ్యానర్‌పై శ్రీను నాగులపల్లి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రాన్ని ఆగస్టులో విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవానికి టాలీవుడ్ దిగ్గజాలు తరలివచ్చారు. స్టార్ డైరెక్టర్లు గోపిచంద్ మలినేని, మల్లిడి వశిష్ట, నందిని రెడ్డి, రచయిత బీవీఎస్ రవి తదితరులు చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు.



## అన్యోన్య దంపతుల మధ్య..


దశాబ్దాల క్రితం వెండితెరపై అన్యోన్య దంపతులుగా మెప్పించిన జగపతిబాబు, లయ కాంబినేషన్ మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఆకెళ్ల వి.కృష్ణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న సస్పెన్స్ ఎమోషనల్ థ్రిల్లర్‌`వదలా. వాసవ ఎంటర్‌టైన్‌మెంట్స్, చరిత చిత్ర ప్రొడక్షన్స్‌పై కిశోర్ నాయుడు చిరుమామిళ్ల, తమ్మారెడ్డి భరద్వాజ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్ర టీజర్‌ను సోమవారం చిత్ర బృందం విడుదల చేసింది. టీజర్ ప్రారంభంలో ఒక అందమైన, సంతోషకరమైన కుటుంబాన్ని చూపిస్తూ.. హఠాత్తుగా వారి జీవితంలోకి ప్రవేశించిన ఒక యువతి (ప్రీతిక శ్రీనివాస్) వల్ల ఆ కుటుంబం ఎలా అతలాకుతలమైందనే అంశాన్ని గ్రిప్పింగ్‌గా చూపించారు. యోగి (జగపతిబాబు) తన భార్య (లయ)ను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమిస్తాడు. అయితే, వీరిద్దరి మధ్యకు వచ్చిన మూడో వ్యక్తి పంతం లేదా ఆవేశం కారణంగా ఆ కుటుంబం ఎలాంటి ప్రమాదంలో పడింది? వారిలో ఒకరిని చంపాలనే హెచ్చరిక వెనుక ఉన్న రహస్యం ఏంటి? అనే ఉత్కంఠను టీజర్ రేకెత్తిస్తోంది. ప్రముఖ సినిమాటోగ్రాఫర్ చోటా కె. నాయుడు అందించిన విజువల్స్, కార్తీక్ కొడకండ్ల నేపథ్య సంగీతం టీజర్‌కు ప్రధాన బలంగా నిలిచాయి. దర్శకుడు ఆకెళ్ల వి.కృష్ణ ఫ్యామిలీ డ్రామాకు థ్రిల్లర్ ఎలిమెంట్స్‌ని జోడించి ఈ చిత్రాన్ని మలిచిన తీరు విలక్షణంగా ఉంది. టీజర్ విడుదల సందర్భంగా హీరో జగపతి బాబు మాట్లాడుతూ..'వదల్లా సాలిడ్ కాన్సెప్ట్ ఉన్న సినిమా. లైఫ్‌లో అన్నీ అనుకోకుండా జరిగిపోయినట్టే ఈ సినిమా కూడా జరిగింది. కిషోర్, భరద్వాజ ఎంతో ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు. విజువల్స్, మ్యూజిక్ అద్భుతంగా వచ్చాయి. ఖచ్చితంగా ఈ సినిమా పెద్ద విజయం సాధిస్తుంది అని ధీమా వ్యక్తం చేశారు.

## నిశ్శబ్ద విషంపై పోరాటం



ప్రముఖ నటి కాజల్ అగర్వాల్, వెర్సటైల్ యాక్టర్ శ్రేయస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటించిన సోషియోనేషనల్ డ్రామా ది ఇండియా స్టోరీ (స్లో పాయిజన్ ఇన్ ప్రోగ్రెస్) విడుదలకు సిద్ధమైంది. సామాజిక బాధ్యతతో కూడిన ఈ చిత్రం జూలై 24న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. చేత్తన్ డీకే దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని సాగర్ బి షిండే నిర్మించి, స్వయంగా కథను అందించారు. ఈ సినిమా ప్రధానంగా దేశంలో విస్తరిస్తున్న రసాయనాల దుర్వినియోగం, పురుగుమందుల సాగు వల్ల తలెత్తుతున్న ఆరోగ్య సంక్షోభం చుట్టూ తిరుగుతుంది. ఆహారంలో కలిసే రసాయనాలు కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదని, అది మానవ మనుగడకే ముప్పుగా పరిణమించిన వైనాన్ని దర్శకుడు ఇందులో ఆవిష్కరించారు.

## కర ఒక సాధారణ యువకుడి కథ



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్, మమితా బైజు జంటగా నటించిన చిత్రం కర. పోరు తొళిల్ వంటి సక్సెస్‌ఫుల్ మూవీని అందించిన విఘ్నేశ్ రాజా ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. కుష్మిత గణేష్ సమర్పణలో డా. ఐషరి కె. గణేష్ నిర్మించిన ఈ సినిమాను తెలుగులో విఘ్నేశ్వర ఎంటర్టైన్మెంట్స్, ఆర్ స్టార్ లాజిస్టిక్స్ సంస్థలు ఏప్రిల్ 30న విడుదల చేస్తున్నాయి.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్ ఘనంగా జరిగింది. ముఖ్య అతిథులుగా విచ్చేసిన సుప్రీమ్ హీరో సాయి దుర్గ తేజ్, దర్శకులు బుచ్చిబాబు సానా, వెంకీ అట్లూరి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. హీరో ధనుష్ మాట్లాడుతూ.. కర సినిమా ఒక సాధారణ యువకుడి కథ. విఘ్నేశ్ రాజా ఈ కథను ఎంతో అద్భుతంగా మలిచారు. పోరు తొళిల్ చూసినప్పుడే ఆయన ఎనర్జీ నాకు నచ్చింది, అందుకే వెంటనే ఈ ప్రాజెక్ట్ ఓకే చేశాను. ఈ మూవీలో మమితా బైజు నటన హైలైట్‌గా ఉంటుంది. జీవీ ప్రకాష్ మరోసారి మంచి సంగీతం అందించారు. ఏప్రిల్ 30న వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఆదరించాలని కోరుకుంటున్నాను అని అన్నారు. ముఖ్య అతిథి సాయి దుర్గ తేజ్ మాట్లాడుతూ.. నిర్మాత గణేష్ చేసే సేవా కార్యక్రమాలు నాకు స్ఫూర్తినిస్తాయన్నారు.

విఘ్నేశ్ గత చిత్రం నాకు చాలా ఇష్టం, ఈ సినిమా కూడా అదే స్థాయిలో ఉండబోతోందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది అని పేర్కొన్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ, ధనుష్‌పై ఉన్న అభిమానంతోనే ఈ కార్యక్రమానికి వచ్చానని తెలిపారు. దర్శకుడు విఘ్నేశ్ రాజా మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు నా గత సినిమాకు ఇచ్చిన గౌరవాన్ని దృష్టిలో పెట్టుకుని, మీ సమయం, డబ్బుకు పూర్తి విలువ ఇచ్చేలా కరను తీర్చిదిద్దాను అని ధీమా వ్యక్తం చేశారు.

